# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 29 7-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




# కల్తీ లడ్డూతో టీటీడీ ప్రతిష్టకు భంగం

- బాత్రూంలు క్లీన్ చేసే పదార్థాలతో నెయ్యి
- ఆ నెయ్యితోనే తిరుమల లడ్డూ ప్రసాదం
- సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ అంటూ అబద్ధపు ప్రచారం
- గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి


= ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: కల్తీ ప్రసాదంతోటీటీడీ ప్రతిష్టను జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దెబ్బ తీసిందని సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆరోపణలు చేశారు. ఐదేళ్ల పాటు బాత్రూంలు కడిగే రసాయనాలతో తయారైన కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేయించారని విమర్శించారు. కల్తీ జరగలేదంటూ సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చాయంటూ చెబుతున్నారని, కానీ జగన్ బాబాయి సుబ్బారెడ్డి స్వయంగా కల్తీ జరిగిందని చెప్పారని గుర్తు చేశారు. కల్తీ వల్ల అపవిత్రమైన టీటీడీని సరిదిద్దేందుకే తాను చర్యలు చేపట్టానని స్పష్టం చేశారు. గతంలో లడ్డూ రుచి, నాణ్యతకు ఇప్పుడు ఇస్తున్న లడ్డూకు స్పష్టమైన తేడా ఉందన్నారు. పరామర్శల పేరుతో

- మిగతా 2వ పేజీలో

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తరు

## బీజేపీ, బీఆర్ఎస్ ది ఫెవికాల్ బంధం



- వాళ్లకు ఓట్లు వేస్తే మూసీ నదిలో వేసినట్టే
- 48 గంటల్లో జైల్లో పెడ్తమన్న కిషన్ రెడ్డి ఎక్కడ దాక్కున్నడు
- కాళేశ్వరం కేసు సీబీఐకి ఇచ్చినా బొక్కలే ఎందుకేస్తలేరు
- కిషన్ రెడ్డే కేసీఆర్ ను కాపాడుతుండు
- కిషన్ రెడ్డి కాస్తా కల్వకుంట్ల కిషన్ రావుగా మారిండు
- దత్తపుత్రుడు, దొంగపుత్రుడు కేసీఆర్ ను పాడుతుండ్రు
- గాడిదకు గడ్డేసి ఆవుకు పాలు పిండొద్దు
- కాంగ్రెస్ గెలిస్తే నిజామాబాద్ కు ఔటర్ రింగ్ రోడ్

= బర్దీపూర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నిజామాబాద్/హైదరాబాద్: కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ను ఎప్పుడు అరెస్టు చేస్తరో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేసు కేసుల్లో అరెస్టు చేయాలని ఎంపీ అరవింద్ అంటున్నారని అన్నారు. కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్ ను బొక్కలో వేస్తామన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్కడ దాక్కున్నారని సీఎం ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..

- మిగతా 2వ పేజీలో



# తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

- రేపు, ఎల్లుండి తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం చేయాల్సి ఉన్న పవన్
- ఎన్నికల ప్రచారం రద్దయినట్టు ప్రకటించిన జనసేన
- అనివార్య కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం

2లో



# హీరో విజయ్‌కు మద్రాస్ హైకోర్టు షాక్

- రూ.1.5 కోట్ల పన్ను జరిమానాను సమర్థించిన కోర్టు
- విజయ్ పిటిషన్ కొట్టేసిన ధర్మాసనం



# మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్

- గడ్చిరోలి జిల్లాలో కాల్పులు
- ఇద్దరు సీ60 కమాండోలకు గాయాలు
- ఏకే47, రెండు ఎస్ఎల్ఆర్‌లు స్వాధీనం

గడ్చిరోలి: మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సల్స్ మృతి చెందారు. గడ్చిరోలి..నారాయణపూర్ సరిహద్దులోని భామ్రాగడ్ తాలూకా ఫొడేవాడ అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పుల్లో జిల్లా పోలీసు బలగాలకు చెందిన ఇద్దరు సీ60 కమాండోలు గాయపడ్డారు. మొదట ఒకరు చనిపోయినట్టు పోలీసులు భావించారు. ఎన్‌కౌంటర్ అనంతరం అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టిన బలగాలు మరో ఇద్దరి మృతదేహాలను గుర్తించాయి. దీంతో మృతుల సంఖ్య మూడు కు చేరింది. చనిపోయిన నక్సల్స్ ఎవరనేది గుర్తించాల్సి ఉంది.

2లో

# చెప్పుల దొంగకు ఎందుకు ఓట్లేయాలి?



- బజార్ల అప్పు కూడా పుట్టని వ్యక్తిని నమ్ముకుంటే ఏం లాభం?
- నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తరు? ఎట్లా అభివృద్ధి చేస్తరు?
- బీఆర్ఎస్ పాలనలో దోపిడీలు, కబ్జాలు తప్ప ప్రజలకు చేసిందేమిటి?
- పొరపాటున ఆ పార్టీలను గెలిపిస్తే. కేంద్ర నిధులను దారి మళ్లిస్తరు
- కేంద్ర మంత్రి బండి సంజయ్

2లో

# బీసీలపై బీఆర్ఎస్ వైఖరేంటి?



- బీసీ రిజర్వేషన్ల జీవోపై కేసు వేసిన వ్యక్తికే టికెట్ ఎలా?
- హైకోర్టులో కేసు వేయించింది బీఆర్ఎస్ పార్టీయేనా..?
- కేటీఆర్ సిరిసిల్లకే ఎందుకు పరిమితమైనట్టు?
- ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఇచ్చిన వారిపై చర్యలేవీ
- మీడియాతో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



# ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? తగలబెడతారా..?

- పవిత్ర లడ్డూపై దుష్ప్రచారం ఆపి.. క్షమాపణ చెప్పాలి
- చంద్రబాబు సర్కారు కుట్రలపై వైఎస్ జగన్ నిప్పులు
- అవే ట్యాంకర్ల నెయ్యిని లడ్డూ తయారీకి వాడారని స్వయంగా సీబీఐ వెల్లడించింది
- చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పులు, వాళ్లు చేసిన అన్యాయంపై చార్జ్‌షీట్‌లో రాసింది
- తనకు అనుకూలమైన నివేదిక కోసమే బాబుసీబీఐ రిపోర్టును కాదని.. కొత్తగా కమిషన్
- న్యాయం కోసం ఎన్‌హెచ్‌ఆర్‌సీ, సుప్రీంకోర్టు తలుపు కూడా తడతాం..
- ఇప్పుడు తప్పులు చేస్తున్న వారెవరినీ వదిలి పెట్టబోం.. బోనులో నిలబెడతాం

# భారత్ టారిఫ్ డీల్ దెబ్బ బంగ్లాదేశ్‌లో గుబులు

- పోటీని తట్టుకోలేమని యూఎస్ కు పరుగులు
- ఎన్నికలకు 3 రోజుల ముందే ట్రేడ్ డీల్స్
- 15 శాతానికి తగ్గే అవకాశం.. షరతులు గోప్యం



2లో

# చెప్పుల దొంగకు ఎందుకు ఓట్లేయాలి?

కరీంనగర్: సీఎం రేవంత్ రెడ్డి చెప్పులెత్తుకుపోయే దొంగ, ఆయనను ఎవరూ నమ్మడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇది తన మాట కాదని. రేవంత్ రెడ్డే చెప్పారని గుర్తుచేశారు.. 'నాకు బజార్ల అప్పు పుట్టడం లేదు. నన్ను ఎవరూ నమ్మడం లేదు. ఢిల్లీకి పోతే చెప్పులు ఎత్తుకుపోయే దొంగలా చూస్తున్నారు' అని ముఖ్యమంత్రే చెప్పారు. మరి అట్లాంటి చెప్పుల దొంగకు మున్సిపల్ ఎన్నికల్లో ఎందుకు ఓట్లేయాలి? బజార్ల అప్పు కూడా పుట్టని వ్యక్తిని నమ్ముకుని ఏం లాభం? నిధులు ఎక్కడి నుండి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తారు?'అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ దుర్శేడ్, గోపాల్ పూర్, సప్తగిరి కాలనీ ఉస్మానీ అసోసియేట్స్ ప్రాంతాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో బండి సంజయ్ మాట్లాడారు. 'బీఆర్ఎసోళ్లు 10 ఏండ్లలో చేసిందేమీ లేదు. కబ్జాలు, దోపిడీలు చేసి జైలుకు పోయారు. ఇప్పుడొచ్చి ఓట్లు అడిగితే ఎందుకు ఓటేయాలని ప్రశ్నించండి. గంగుల, వినోద్ రావు ముఖాలే మోదీకి తెల్వదు... వాళ్లను చూసి నిధులిస్తారా? బీజేపీకి కరీంనగర్ మేయర్ పీఠం అప్పగిస్తే...వరదలా నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది. కాంగ్రెస్ కు ఓట్లేసి గెలిపిస్తే ఇంటి పన్నులు,కరెంట్, నల్లా ఛార్జీలు పెంచుతారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను 6 గ్యారెంటీలపై నిలదీయండి. పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లేస్తే కేంద్ర నిధులను దారి మళ్లిస్తారు. అభివృద్ధి కుంటుపడుతుంది' అని అన్నారు.

# బీసీలపై బీఆర్ఎస్ వైఖరేంటి?

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల జీవోపై కోర్టులో కేసు వేసిన బుట్టెంగారి మాధవరెడ్డికి మూడు చింతల పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీఫాం ఇవ్వడాన్ని జాగృతి తెలంగాణ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా ఖండించారు. బంజారా హిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో బీసీల పట్ల బీఆర్ఎస్ వైఖరిని ఆమె ప్రశ్నించారు. మాధవరెడ్డితో కేసు వేయించింది బీఆర్ఎస్ పార్టీయేనా? దీనిపై పార్టీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాధవరెడ్డి హరీష్ రావుకు సన్నిహితుడని పేర్కొంటూ, ఇలాంటి వ్యక్తులకు కేటీఆర్ ఓటు వేయమంటారా? అని కవిత ప్రశ్నించారు. మాధవరెడ్డి మొదట జాగృతిలో పని చేసి, ఆ తర్వాత తన సామాజిక వర్గం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేసుకున్నాడన్నారు. బీసీల కోసం బీఆర్ఎస్ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని, బీసీల పట్ల ఆ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉందా లేదా ప్రజలు అర్థం

**చేసుకోవాలన్నారు.**

స్పీకర్ గారూ.. గాంధీపై వేటు వేయాలె

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వేటు వేయాలని మాజీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. గాంధీ బీఆర్ఎస్‌లో ఉన్నానని చెబుతూనే నిజామాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా ఎలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని అన్నారు.

**కేటీఆర్ సిరిసిల్లకే పరిమితమా?**

సిరిసిల్లలో 17 మంది ఇండిపెండెంట్లు, ఫార్వర్డ్ బ్లాక్ పోటీలో ఉన్నారని గుర్తు చేశారు. అయినా కేటీఆర్ అక్కడికే పరిమితమై ప్రచారం చేయడం వెనుక కారణాలేమిటో ప్రజలు ఆలోచించాలన్నారు. కృష్ణార్జునుల్లా రాష్ట్రం అంతా బీఆర్ఎస్ నేతలు ఎందుకు పర్యటించడం లేదని ప్రశ్నించారు. హరీష్ రావుకు తాను పెట్టిన 'గుంట నక్క' అనే పేరు పూర్తిగా సరిపోతుందన్నారు. ఊరికే పేర్లు పెట్టనని, ఆయన్ను ఆ పేరుతోనే సంబోధిస్తానని వ్యాఖ్యానించారు.

# భారత్ టారిఫ్ డీల్ దెబ్బ
# బంగ్లాదేశ్‌లో గుబులు

ఢిల్లీ: భారత్‌తో అమెరికా కుదుర్చుకున్న టారిఫ్ ఒప్పందమే బంగ్లాదేశ్‌ను ఆందోళనలోకి నెట్టింది. భారత వస్తువులపై సుంకాలు 18 శాతానికి తగ్గడంతో, అదే మార్కెట్‌పై ఆధారపడిన బంగ్లాదేశ్ తీవ్ర ఒత్తిడిలో పడింది. అమెరికా మార్కెట్‌లో పోటీ నిలబెట్టుకోవాలంటే వెంటనే ఒప్పందం కుదుర్చుకోవాల్సిందేనన్న ఆతృతతో ఢాకా ఎన్నికలకు మూడు రోజుల ముందే అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సిద్ధమైంది. అమెరికాకు బంగ్లాదేశ్ చేసే ఎగుమతుల్లో దాదాపు 90 శాతం రెడీమేడ్ గార్మెంట్సే. సుంకాల్లో స్వల్ప తేడా వచ్చినా ఆర్డర్లు భారత్ వైపు మళ్లే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 20 శాతంగా ఉన్న సుంకాన్ని 15 శాతానికి తగ్గించేందుకు బంగ్లాదేశ్ ప్రయత్నిస్తోంది. 2025లో అమెరికా బంగ్లాదేశ్‌పై 37 శాతం సుంకం విధించగా, దశలవారీగా తగ్గించారు. తాజా ఒప్పందం అదే దిశలో ముందడుగు అయినప్పటికీ, ఒప్పంద షరతులు పూర్తిగా రహస్యంగా ఉంచడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. తాత్కాలిక ప్రభుత్వం అమెరికాతో నాన్ డిస్క్లోజర్ ఒప్పందం చేసుకుని వివరాలను ప్రజలకు, పార్లమెంట్‌కు వెల్లడించలేదు. అమెరికా షరతులుగా చైనా దిగుమతులు తగ్గించడం, రక్షణ సామగ్రి కొనుగోళ్లను అమెరికా వైపు మళ్లించడం, అమెరికా వస్తువులకు బంగ్లాదేశ్ మార్కెట్లో అడ్డంకుల్లేని ప్రవేశం ఇవ్వడం వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం.

# హీరో విజయ్‌కు మద్రాస్ హైకోర్టు షాక్



నటుడు, టీవీకే అధినేత విజయ్‌కు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. విజయ్‌పై విధించిన రూ.1.5 కోట్ల పన్ను జరిమానాను ధర్మాసనం సమర్థించింది. దీంతో నటుడికి భారీ షాక్ తగిలినట్లైంది. 2015-16లో రూ.15 కోట్ల ఆదాయాన్ని వెల్లడించలేదని ఆరోపిస్తూ విజయ్‌పై ఆదాయపు పన్ను శాఖ రూ.1.5 కోట్ల జరిమానా విధించింది. అయితే దీనిపై విజయ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషన్ విచారించిన ధర్మాసనం.. జరిమానాను సమర్థిస్తూ విజయ్ పిటిషన్ కొట్టేస్తూ తీర్పునిచ్చింది. జనవరి 23, 2026న తీర్పును రిజర్వ్ చేసిన జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి తీర్పును శుక్రవారం వెలువరించారు. పన్ను అధికారులు జారీ చేసిన షోకాజ్ నోటీసు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 263 కింద నిర్దేశించిన కాలపరిమితిలో ఉందని.. దాని జారీలో ఎటువంటి విధానపరమైన లోపాన్ని కనుగొనలేదని కోర్టు అభిప్రాయపడింది.

# ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? తగలబెడతారా..?

(మొదటి పేజీ తరువాయి)



'చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని సీబీఐ చార్జ్‌షీట్‌లో తేల్చి చెప్పింది. తిరుమలలో వాడిన నెయ్యిలో జంతు కొవ్వు కానీ, పంది కొవ్వు కానీ, చేప నూనె కానీ కలవలేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ చంద్రబాబు అన్యాయంగా ఇంకా దుష్ప్రచారం కొనసాగిస్తూనే ఉన్నారు. చంద్రబాబు సీఎం కాక ముందు వరకు ఎమురైనా తిరుమల ప్రసాదం ఇస్తే కళ్లకు అద్దుకుని తినేవారు. కానీ ఇప్పుడు ఆ ప్రసాదం పవిత్రతను చంద్రబాబు దిగజార్చాడు. ఒక అబద్ధాన్ని సృష్టించి రాజకీయాల కోసం దేవుడిని కూడా వాడుకున్న దుర్మార్గుడు చంద్రబాబే. లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు లేదని ఎన్‌డీఆర్ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌ల నివేదికలు స్పష్టం చేసినా చంద్రబాబు ఇంకా ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం దారుణం..' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. అబద్ధాన్ని సృష్టించి రెక్కలు కట్టి దుష్ప్రచారం చేశారని, కానీ చంద్రబాబువి అబద్ధాలని సీబీఐ చార్జ్‌షీట్ తేల్చేసిందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో టీడీపీ మూకల దాడిలో దెబ్బతిన్న జోగి రమేష్ ఇంటిని శుక్రవారం వైఎస్ జగన్ పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.. చంద్రబాబు అబద్ధాలను ప్రశ్నిస్తున్నందుకు చిప్ పని చేయక పోవడం వల్లే కక్షగట్టి దాడులకు దిగుతున్నారు. చేసిన తప్పు ఒప్పుకుని, లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పకుండా ఎదురుదాడి చేస్తున్నారు. ఇప్పుడు వన్‌మ్యాన్ కమిషన్ అంటూ అనుకూల నివేదిక కోసం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారు. ఆ కమిషన్‌కు ఏ మాత్రం విలువ ఉండదు. టీడీపీ గూండాలు గుంటూరులో అంబటి రాంబాబు ఇంట్లో ఐదు కార్లు ధ్వంసం చేయడంతోపాటు ఇల్లు, ఆఫీసులో విధ్వంసం సృష్టించి ఆఫీస్‌కు నిప్పుపెట్టారు. ఆ మర్నాడు ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు జోగి రమేష్ ఇంటిపై ఏకంగా యాసిడ్ బాటిళ్లతో, పెట్రోల్ బాంబులతో విధ్వంసం సాగించారు. అక్కడ అంబటి రాంబాబు.. ఇక్కడ జోగి రమేష్ తండ్రిపై హత్యాయత్నం జరిగింది. పోలీసుల సమక్షంలోనే రెండు చోట్లా దాడులు జరిగాయి. టీడీపీ గూండాలకు వారు అండగా ఉంటున్నారు. నాగరిక సమాజం తల దించుకునేలా చంద్రబాబు రాష్ట్రంలో జంగిల్‌రాజ్ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తున్నారు. నాగరిక సమాజం తల దించుకునేలా చంద్రబాబు సర్కారు చర్యలు ఉన్నాయి. తప్పులు చేస్తున్న ఎవరినీ వదిలిపెట్టబోం. సుప్రీంకోర్టు తలుపు కూడా తడతాం. మరో మూడేళ్లలో వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ఇప్పుడు తప్పులు చేస్తున్న అందరినీ బోనులో నిలబెడతాం. వారికి శిక్ష తప్పదు. రాష్ట్రంలో జంగిల్‌రాజ్ పరిపాలన సాగుతోంది. నాగరిక ప్రపంచం తలవంచుకునేలా చంద్రబాబు నాయుడు చేశారు. గుంటూరులో అంబటి రాంబాబు ఇంట్లో 5 కార్లను ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడ్డారు. అద్దాలను పగలగొట్టారు. ఇంట్లో ఆడవాళ్లను దుర్భాషలాడారు.

# జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు ఏపీ హైకోర్టులో బిగ్ రిలీఫ్..



జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. వీణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు క్వాష్ చేయాలని శ్రీధర్ పిటిషన్ వేశారు. తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని.. ఎలాంటి ఆధారాలు లేని దురుద్దేశంతో పెట్టిన కేసు నుంచి ఉపశమనం కల్పించాలని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై కోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీఎన్ఎస్ 35(3) ప్రకారం నడుచుకోవాలని పోలీసులకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ చట్టం ఏకపక్ష అరెస్టులను కష్టతరం చేస్తుంది. అరెస్ట్ ఆవశ్యకతను సమర్థిస్తూ పోలీసు అధికారి వ్రాతపూర్వక కారణాలను నమోదు చేస్తే తప్ప అరెస్టు చేయలేరు. ఒక వేళ అరెస్ట్ చేస్తే చట్టబద్ధంగా సవాలు చేస్తుంది. ఇదిలా ఉండగా.. లైంగిక దాడి, మోసం ఆరోపణల నేపథ్యంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను జనసేన త్రిసభ్య కమిటీ మొన్న (మంగళవారం) సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కోడూరుకు వచ్చిన కమిటీ సభ్యులు రమాదేవి, శివశంకర్, వరుణ్.. నేరుగా స్థానిక రాజ్ రెసిడెన్సీలో ఎమ్మెల్యేతో భేటీ అయ్యారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 7 గంటల వరకు విచారణ కొనసాగింది. బాధితురాలు చేసిన ఆరోపణలు, వాట్సప్ చాటింగ్ వ్యవహారం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులపై అరవ శ్రీధర్‌ను కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే తన వాదనను కమిటీ ముందు సవివరంగా వినిపించారు. ఎమ్మెల్యేనే కాకుండా పార్టీలో క్రియాశీలకంగా ఉన్న సుమారు 40 మంది ఎంపిక చేసిన నాయకులు, కార్యకర్తలను కూడా కమిటీ పిలిపించి విచారించింది. ఎమ్మెల్యే ప్రవర్తన, తాజా పరిణామాలపై వారి నుంచి సమాచారం సేకరించింది. సాయంత్రం మరోసారి ఎమ్మెల్యేని పిలిపించి మాట్లాడారు. ఈ అంశంపై సుదీర్ఘంగా విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.

# కల్తీ లడ్డూ తో టీటీడీ ప్రతిష్టకు భంగం

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరుకు వెళ్లే సమయంలో ఆరు గంటల పాటు ట్రాఫిక్‌ను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. గతంలో కాన్వాయ్ కింద వ్యక్తి మృతి, బంగారుపాళ్యంలో మామిడి కాయలను తొక్కించిన ఘటనలు రౌడీయిజానికి నిదర్శనమన్నారు. బలప్రదర్శనలు ఎన్నికల సమయంలో చేయాలేగానీ, ప్రజాసమస్యలపై కాదు అని వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టును గోదాట్లో ముంచేశారని చంద్రబాబు ఆరోపించారు. డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్లు దుర్వినియోగం చేశారని, ఇప్పుడు మళ్లీ అదనంగా రూ.1000 కోట్లతో దానిని నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలు పన్నులుగా చెల్లించిన డబ్బులను గత పాలకులు వృథా చేశారని విమర్శించారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

**పట్టి సీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు**

పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి నీరు, శ్రీశైలం ద్వారా రాయలసీమకు నీరు అందిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. నీళు ్లంటే పంటలే కాదు పరిశ్రమలూ వస్తాయని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరిస్తామని హామీ ఇచ్చారు. రాయలసీమలో 2019కి ముందు మంజూరైన 120 ప్రాజెక్టులకు గత ప్రభుత్వం రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమకు శాశ్వత నీటి భద్రత కల్పిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ ను ఎప్పుడు అరెస్టు చేస్తరు

(మొదటి పేజీ తరువాయి)



కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగించి ఆరు నెలలు గడిచినా అతీ గతీ లేదన్నారు. కిషన్ రెడ్డే కేసీఆర్ ను కాపాడుతున్నారని సీఎం ఆరోపించారు. కిషన్ రెడ్డి కాస్తా కల్వకుంట్ల కిషన్ రావుగా మారారని ఆరోపించారు. దొంగపుత్రుడు, దత్తపుత్రుడు కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారని సీఎం ఆరోపించారు. ఫార్ములా ఈ రేసు కేసులు కట్టి అరెస్టు చేయుమంటే మోదీ ఆఫీసులో ఫైల్ మూలకు పడ్డదని అన్నారు. మోదీ దగ్గర పరపది ఉన్న అరవింద్ ఆ ఫైలు గురించి ఎందుకు అడగడం లేదన్నారు. లక్షల కోట్ల కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందని, మీరు ఎందుకు ఆ కేసును ముందుకు కొనసాగిస్తలేరని ప్రశ్నించారు. నిజామాబాద్ వ్యవసాయానికి మారుపేరని, బంగారంతో పోటీ పడే పసుపు ఇక్కడ పండుతుందని చెప్పారు. చెరుకు, పసుపు, వరిధాన్యం.. ఇక్కడి వ్యవసాయం దేశానికి ఆదర్శమని తెలిపారు. హర్యానా, పంజాబ్ తరహాలో రైతులు హక్కుల కోసం కొట్లాడే జిల్లా నిజామాబాద్ అని చెప్పారు. రైతాంగ పోరాట పటిమ ఉన్న ఈ జిల్లాలో కాంగ్రెస్ గెలవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్, డీఎస్ జోడీలో 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. 2029లో డీఎస్, వైఎస్ కాంబినేషన్ తరహాలో తెలంగాణలో రెండో సారి తాను, మహేశ్ కుమార్ గౌడ్ కాంబినేషన్ లో అధికారంలోకి వస్తమని అన్నారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే నిజామాబాద్ కు ఔటర్ రింగ్ రోడ్డు ఇచ్చే బాధ్యత తనదని అన్నారు. గాడిదకు గడ్డేసి ఆవుకు పాలు పిండొద్దని అన్నారు. నిధులు ఇవ్వాలంటే కార్పొరేటర్, మేయర్ మనోడు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే ఆర్ భూపతి రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేశ్ రెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, మానాల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం రద్దయింది. ఇంతకు ముందు వెలువడిన ప్రకారం రేపు, ఎల్లుండి ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. తాజాగా ఆయన ఎన్నికల ప్రచారం రద్దయినట్టు జనసేన ప్రకటించింది. ఏపీలో రాజకీయ పరిణామాలు, పవన్ వ్యక్తిగత కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం. మరోవైపు, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో ఈ ఉదయం పవన్ భేటీ అయిన సంగతి తెలిసిందే. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల గురించి వారితో పవన్ చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, సాగర్ (ఆర్కే నాయుడు) తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## త్యాగాలు మావి.. పదవుల భోగాలు మీవా?

- అట్టడుగునే మలిదశ ఉద్యమకారులు.. పట్టించుకోని ప్రభుత్వం
- ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ధ్వజం
- నెల రోజుల్లోపు జుడీషియల్ కమిటీ వేయాలని డిమాండ్
- టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగీశెట్టి క్రిస్టఫర్



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** రాష్ట్రం అనేక పోరాటాలు, బలిదానాలు, త్యాగాల ఫలితంగా సాధ్యమైందని, ఉద్యమకారుల త్యాగాలు లేకుండా నేడు కొందరు అనుభవిస్తున్న భోగాలు, పదవులు సాధ్యమయ్యేవి కావని మలిదశ ఉద్యమకారుడు, టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. త్యాగాలు చేయని వారికి పదవులు ఎలా దక్కాయో ఆలోచించాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన రాష్ట్రంలో, నేడు అనేక మంది ఉద్యమకారులు కనీస జీవన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొనడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం కోసం పోరాడిన వారికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నెలరోజుల్లోపు ఉద్యమకారులను గుర్తించేందుకు జ్యుడీషియల్ కమిటీ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల త్యాగాలను గౌరవిస్తూ వారికి తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో రాణించాలి

- జడ్పీహెచ్ఎస్ చందుపట్లను తనిఖీ చేసిన డీఆర్వో జయమ్మ



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జయమ్మ సూచించారు. శుక్రవారం భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన విధానం, పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 'సి' కేటగిరీకి చెందిన విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై, రాబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికతో చదవాలని సూచించారు. వెనుకబడిన సబ్జెక్టులను ప్రతిరోజూ ఒకటి లేదా రెండు సార్లు పునశ్చరణ చేయాలని తెలిపారు. కష్టపడి చదివితే మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు 'సి' కేటగిరీ విద్యార్థులపై మరింత దృష్టి సారించి ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నాయకురాలిగా కాదు.. మీ సేవకురాలిగా ఉంటా!

- గడపగడపకు కాంగ్రెస్ అభ్యర్థి మంజుల ప్రచారం
- ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందిస్తామని హామీ
- ఏడో వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముమ్మర ప్రచారం
- 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఏడవ వార్డు అభ్యర్థి కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి సుందరయ్య కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు బొట్టు పెట్టి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఏడవ వార్డులో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి ఇంటికి ప్రతిరోజూ కృష్ణా జలాలు అందించడంతో పాటు, మురుగునీటి సమస్య పరిష్కారానికి అన్ని బజార్లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను తన సమస్యలుగా భావించి, నాయకురాలిగా కాకుండా సేవకురాలిగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో దుబ్బాక శ్రీనివాస్ రెడ్డి, ఆకాష్ రెడ్డి, ఐలయ్య, అశోక్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొనగా, కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు.



## మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా జరగాలి





- పీవో, ఏపీవోల శిక్షణలో కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంతరావు అన్నారు. శుక్రవారం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పి.ఓ, ఏ.పి.ఓలకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో, అలాగే యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి అవగాహనతో, బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని ఉదయం 8 గంటలలోపు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద స్వీకరించుకోవాలని, అవసరమైన అన్ని వస్తువులు వచ్చాయా లేదా అన్నది ముందుగా పరిశీలించుకోవాలని సూచించారు. సంబంధిత పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు అందాయా లేదా అన్నది చెక్ చేసుకోవాలని, బ్యాలెట్ బాక్సులు సక్రమంగా తెరుచుకుంటున్నాయా అనే విషయాన్ని ముందుగానే పరీక్షించుకోవాలని చెప్పారు. అలాగే స్వస్తిక్ గుర్తు, మున్సిపాలిటీలకు సంబంధించిన స్టాంపులు తదితర సామగ్రి పూర్తిగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రతి ఓటరు తన ఓటును బ్యాలెట్ బాక్సులో వేస్తున్నారా లేదా అన్నది జాగ్రత్తగా పర్యవేక్షించాలని, పోలింగ్ రోజున సమయపాలన పాటించడంతో పాటు ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం సామగ్రిని సురక్షితంగా రిసెప్షన్ కౌంటర్లలో అప్పగించాలని పేర్కొన్నారు. ప్రతి పి.ఓ, ఏ.పి.ఓ అధికారి తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ హనుమంతరావు కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పి.ఓలు, ఏ.పి.ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లను ప్రలోభాలకు గురిచేయవద్దు





- నగదు, మద్యం పంపిణీపై కట్టుదిట్టమైన నిఘా
- సరిహద్దుల్లో చెక్ పోస్టులు.. షాడో టీమ్స్ నిఘా
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ మహేష్ భగవత్‌తో కలిసి ఉమ్మడి నల్గొండ, నిజామాబాద్ జిల్లాల జనరల్ అబ్జర్వర్లు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం సాగాలని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, నగదు, ప్రలోభాలకు ఉపయోగించే సామగ్రిపై ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగిస్తున్నామని చెప్పారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులపై పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా షాడో టీంల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఎన్నికల పరిశీలకురాలు గౌతమి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో 104 వార్డులకు 212 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ.. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా!



- గడపగడపకు కాంగ్రెస్ అభ్యర్థి మంజుల ప్రచారం
- పేద కుటుంబాలకు అండగా ఉంటానని హామీ
- రెండో వార్డులో ముమ్మర ప్రచారం
- 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సుర్వి మంజుల నరసింహ గౌడ్.



**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 2వ వార్డు సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ 2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సుర్వి మంజుల నరసింహ గౌడ్ అన్నారు. శుక్రవారం రెండో వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధి కోసం చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. తనను కౌన్సిలర్‌గా గెలిపిస్తే, అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తూ, వార్డు సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రెండో వార్డులో అభివృద్ధి కొనసాగాలంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అభివృద్ధే ధ్యేయంగా, ప్రజాసేవే లక్ష్యంగా తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోలింగ్ అధికారులకు విస్తృత శిక్షణ

- మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** చౌటుప్పల్ పురపాలక సంఘం రెండో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులకు నియమితులైన పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు శుక్రవారం స్థానిక పురపాలక కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు కీలక సూచనలు, దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించే విధంగా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రధాన శిక్షకులు ఎం. నరేందర్ రెడ్డి, బి. దశరథ్‌లు శిక్షణ అందించారు. ఈ శిక్షణలో మొత్తం 96 మంది ఎన్నికల అధికారులు, ఎన్నికల నిర్వహణ అధికారులు, సహాయ ఎన్నికల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు. శిక్షణలో పోలింగ్ రోజున పాటించాల్సిన నిబంధనలు, ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ విధానం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాలెట్ పెట్టె మూసివేత విధానం తదితర అంశాలు సవివరంగా వివరించారు. సహాయ జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ తహసీల్దార్ వీరబాయి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఈ. గురువారావు, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ అధికారి డి. అంజయ్య, సీనియర్ సహాయకుడు రఘుపతి, పారిశుధ్య తనిఖీ అధికారి హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# దివిస్ సహకారంతో అంకిరెడ్డిగూడెం అభివృద్ధి

- పరిశ్రమ ప్రతినిధి సుధాకర్‌కు సన్మానం
- ఉపాధి అవకాశాలు కల్పించాలని సర్పంచ్ వినతి
- గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్



**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** లఅంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ నేతృత్వంలో గ్రామపంచాయతీ ప్రతినిధులు దివిస్ పరిశ్రమ చాంబర్‌లో పరిశ్రమ యాజమాన్య ప్రతినిధి పెండ్యాల సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా సహకారం అందించాలని ప్రతినిధులు కోరారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు అర్హత కలిగిన గ్రామస్తులకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి అంశాలపై ప్రతినిధులతో పరిశ్రమ తరఫున చర్చ జరగ్గా, సహకారం అందించే దిశగా సానుకూలంగా స్పందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలందాస్ మహేష్ గౌడ్, వార్డు సభ్యులు బత్తుల అనూష మహేష్ గౌడ్, పాలెం వెంకటేశం గౌడ్, ముద్ధం లింగస్వామి గౌడ్, దొడ్ల అండాలు శెట్టయ్య గౌడ్, దండుగల వెంకటేశం, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, రాపోలు రేణుక మల్లేశం, శివ ప్రసాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పరిశ్రమల సహకారం ఎంతో అవసరమని ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



- 14వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి విజయలక్ష్మి విమర్శ
- ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 14వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి చింతల విజయలక్ష్మి దామోదర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని తమకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సంక్షేమ పథకాలు ఎక్కడా అమలవడం లేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో చింతల మహిపాల్‌రెడ్డి, బోరం ప్రకాశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లంకల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వార్డు అభివృద్ధికి అవకాశం ఇవ్వండి



- ఆశీర్వదించి గెలిపించండి.. సేవకురాలిగా ఉంటా
- గడపగడపకు తిరిగి ఓట్ల అభ్యర్థన
- 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వెన్‌రెడ్డి సంధ్యారాజు



**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్‌రెడ్డి సంధ్యారాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'చెయ్యి' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా వెన్‌రెడ్డి సంధ్యారాజు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వెన్‌రెడ్డి రాజు విజయం సాధించి చైర్మన్‌గా ఎన్నికై 16వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఆ అభివృద్ధిని కొనసాగించేందుకు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కానుగుల వెంకటయ్య, శేఖర్, వీరమళ్ళ యాదయ్య, ఎండి ఖలీల్, ఆవుల యేసు, ఉడుత రామలింగం, సాయిరాజ్, శ్రీశైలం, వీరమల్ల యాదయ్యలతో పాటు సీపీఐ నాయకులు టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మల్కాపురం విద్యార్థులు

- జిల్లా స్థాయిలో బాలికలకు ప్రథమ, బాలురకు ద్వితీయ స్థానం
- విజేతలను అభినందించిన డీఈవో సత్యనారాయణ

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** జిల్లాస్థాయి "పీఎం శ్రీ" ఫుట్‌బాల్ పోటీల్లో చౌటుప్పల్ మండలం మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో బాలికల జట్టు ప్రథమ స్థానం, బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందింది. ఈ విజయంతో మల్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు బాలురు, 11 మంది బాలికలు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ, చౌటుప్పల్ మండల విద్యాధికారి గురవారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తనూజ, ఫిజికల్ డైరెక్టర్ భావన, ఉపాధ్యాయ బృందం, మల్కాపూర్ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్, ఉపసర్పంచ్ నరసింహాలు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొనడానికి అవసరమైన సహాయాన్ని అందించాల్సిందిగా స్థానిక దాతలు, ప్రజాప్రతినిధులకు వారు విజ్ఞప్తి చేశారు.



# కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే అభివృద్ధికి ఓటేసినట్టే

**చండూర్,** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్టే అని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు... శుక్రవారం చండూరు మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు... మొదట మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి కోడి శ్రీనివాసులు తో కలిసి ప్రచారం చేశారు... ఆయా వార్డులో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులని కలుపుకొని గడపగడప ప్రచారంతోపాటు కార్నర్ మీటింగ్లో పాల్గొన్నారు... తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం వల్లే చండూర్ మున్సిపాలిటీకి అభివృద్ధి నిధులు వచ్చాయని ఆరోజు మంజూరైన చండూరు పట్టణ ప్రధాన రహదారి మధ్యలోనే వదిలేస్తే రెండు సంవత్సరాలలో మళ్లీ నేనే దాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు... దేవుడు మనకు ఇచ్చిన శక్తిలోనే కొంత పేద ప్రజలకు సేవ చేయాలని మా తల్లి ఎప్పుడు చెప్తుండేదని తన మాతృమూర్తిని గుర్తు చేసుకుంటూ... ఆమె చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని మాతృమూర్తి కోమటిరెడ్డి



సుశీలమ్మ ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతోమంది పేదలకు సహాయం చేస్తున్నానన్నారు... ప్రతి ఒక్కరూ అదే స్ఫూర్తి తో సహాయం చేయాలని పిలుపునిచ్చారు... చండూరు మున్సిపాలిటీలో 10 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి తోడ్పడాలని ఓటర్లను కోరారు... కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని కాంగ్రెస్ పార్టీ దళితులను గెలిపిస్తే ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు... ఉదయం 10 గంటలకు మొదలైన ఎన్నికల ప్రచారం రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# ఆదరించి ఆశీర్వదిస్తే.. అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా!

- 18వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అరుణ శంకర్ ముమ్మర ప్రచారం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే 18వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గుగులోతు అరుణ శంకర్ నాయక్ హామీ ఇచ్చారు. శుక్రవారం వార్డులోని పలు కాలనీల్లో ఆమె ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ప్రతి గడపకు తిరుగుతూ ఓటర్లను ఆప్యాయంగా పలకరించి 'చేయి' గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్ఫూర్తితో వార్డు ప్రగతికి కృషి చేస్తానని, రాబోయే ఐదేళ్లలో వార్డును మునుపెన్నడూ లేని రీతిలో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శైలజ భాస్కర్, కాసోజు లింగాచారి, తడక అమర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ధ్యేయం.. ప్రజా సేవే లక్ష్యం

- 13వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వాణి విప్లవ్ గెలుపునకు కృషి
- గడపగడపకు తిరిగి 'చేయి' గుర్తుకు ఓట్ల అభ్యర్థన

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్‌తోనే సాధ్యమని వార్డు ఇన్‌చార్జులు వర్కాల కుమార్ గౌడ్, చెవగోని వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం వార్డులో గడపగడపకు తిరుగుతూ చేతి గుర్తుపై ఓటు వేసి బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్‌ను గెలిపిస్తే వార్డు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు సహకారం అందుతుందని తెలిపారు. పేద కుటుంబాలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఇప్పటికే సొంతింటి కల నెరవేరేలా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. అభివృద్ధి కొనసాగాలంటే 13వ వార్డు ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు వస్తున్న బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్‌గా గెలిపిస్తే ఎమ్మెల్యే సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ఈ నెల 11న జరగనున్న ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్గం నరసింహ, తొర్పునూరి బాబు, వార్డు ఇన్‌చార్జులు మస్తాన్ బాబు, దేప శ్యాంసుందర్‌తో పాటు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.



# తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- అంగన్‌వాడీల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి
- 11 మందితో ఆరోగ్యలక్ష్మి తల్లుల కమిటీ ఏర్పాటు
- సర్పంచ్ టేకుల మంజుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 6 (తొలివెలుగు) :** తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను గర్భిణీలు, బాలింతలు సమర్థంగా వినియోగించుకోవాలని అల్లాపురం గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి తల్లుల కమిటీని 11 మంది సభ్యులతో అంగన్‌వాడీ కార్యకర్త సింగిరెడ్డి అమృత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పాలు, గుడ్లు, పప్పుతో తయారుచేసే కిచిడి, బాలామృతం వంటి ఆహారాన్ని పిల్లలకు క్రమం తప్పకుండా అందించాలని తల్లులను కోరారు. అలాగే పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాల్సిన అవసరం ఉందని, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్ అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సింగిరెడ్డి అమృత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అంజలి, ఆశా వర్కర్ ఫక్కీరు దివ్యశ్రీ, సంఘబంధం అధ్యక్షురాలు యంజాల భార్గవి, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..




# వాయిదా పర్వం

న్యూఢిల్లీ: లోక్‌సభలో వి పక్షాల ఆందోళనలు శుక్రవారం కూడా నిర్నిరోధంగా కొనసాగాయి. దాంతో కార్యకలాపాలేవీ సాగించకుండానే సభ మరోసారి వాయిదాపడింది. ఉదయం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు పలు అంశాలపై ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ ఓం బిర్లా వారించినా లాభం లేకపోయింది. దాంతో, ఇలాంటి అంతరాయాలతో ఈ సమావేశాల్లో ఇప్పటికే ఏకంగా 19 గంటల విలువైన సభా సమయం వృథా అయిందంటూ ఆయన ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్ సభ్యురాలు ప్రియాంకగాంధీ అడగాల్సిన ప్రశ్న కూడా జాబితాలో ఉందని తెలిపారు. అయినా లాభం లేకపోవడంతో, ఇటువంటి సభను తాను నడపలేనంటూ స్పీకర్ ఆగ్రహం వెలిబుచ్చారు. నాలుగు నిమిషాలకే సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమయ్యాక కూడా అవే దృశ్యాలు కన్పించాయి. సభ్యులు నినాదాల నడుమ తిరిగి వెల్‌లోకి దూసుకెళ్లారు. తమ స్థానాల్లోకి తిరిగి వెళ్లాల్సిందిగా ప్యానెల్ స్పీకర్ కృష్ణప్రసాద్ తెన్నేటి పదేపదే విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయింది. దాంతో సభను లోక్‌సభ గత సోమ వా రం నుంచీ విపక్షాల నిరసనలలో అట్టుడు కుతోంది. పలు అంశాలపై అధికార, విపక్షాలు నడుమ నువ్వా, నేనా అన్నట్టు తలపడుతున్నాయి. 2020 భారత్‌చైనా ఘర్షణకు సంబంధించి నాటి ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రస్తావించేందుకు రాహుల్ చేసిన ప్రయత్నం వివాదానికి దారి తీయడం తెలిసిందే. దానిపై మొదలైన రగడ కొనసాగుతూనే ఉంది. దాంతో రాష్ట్రప తి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని గత 22 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని సమాధానం లేకుండానే సభ ఆమోదించింది. లోక్‌సభ వాయిదా పడ్డాక పార్లమెంటు ప్రాంగణంలో మకరద్వారం వద్ద కాంగ్రెస్‌తో పాటు పలు ఇతర పార్టీల ఎంపీలు నిరసనకు దిగారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం, నరవణె పుస్తకం, 8 మంది ఎంపీల సస్పెన్షన్ తదితరాలపై నినాదాలతో హోరెత్తించారు. 'వాణిజ్య వల'అంటూ అమెరికా ఒప్పందంపై బ్యానర్ ప్రదర్శించారు. ప్రియాంక, సస్పెండైన ఎంపీలతో పాటు పలువురు వీటిలో పాల్గొన్నారు.

# జమ్మూలో పర్యటిస్తున్న అమిత్‌షా

కేంద్ర హోం మంత్రి జమ్మూకశ్మీర్ పర్యటనకు వెళ్లారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం జమ్మూ వెళ్లిన ఆయన భద్రతాబలగాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భద్రతా బలగాలతో సమీక్ష నిర్వహించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అమిత్‌షా పర్యటనకు కొద్ది గంటల ముందే జమ్మూ ప్రాంతంలో భద్రతా బలగాలు ముగ్గురు తీవ్రవాదులను మట్టుబెట్టడం కలకలం రేపింది అమిత్‌షాకు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్‌అబ్దుల్లా ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం హీరానగర్ సెక్టార్‌లోని గుర్నామ్, బోబియాన్ పోస్టులను సందర్శించారు. దీఆఖీ బలగాలకు సంబంధించిన ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రారంభించారు. అనంతరం బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భద్రతా పరిస్థితులపై ఆరా తీశారు. అదేవిధంగా గతేడాది వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాన్ని అమిత్ సందర్శించారు. రేపు జమ్మూలోని లోక్‌భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హాతో పాటు ఇతర అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. జమ్ము ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను తెలుసుకుంటారు. ఉగ్రవాదుల ఎరివేతకు వారు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రికి అధికారులు వివరించనున్నారు. అనంతరం ఇటీవల ఉగ్రవాదుల దాడుల్లో అమరులైన జవాన్ల కుటుంబాలతో అమిత్‌షా ప్రత్యేకంగా భేటీ అయి వారికి పరిహారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

# అగ్ని3 పరీక్ష విజయవంతం

బాలాసోర్ (ఒడిస్సా): బారత సాయుధ దళాల అమ్ములపొది మరింత బలోపేతమైంది. శుక్రవారం జరిపిన అణ్వస్త్ర సామర్థ్యంతో కూడిన అత్యాధునిక అగ్ని3 ఖండాంతర క్షిపణి పరీక్ష విజయవంతమైంది. 3,000 కిలోమీటర్ల పై చిలుకు దూరంలోని లక్ష్యాలను ఛేదించగల 17 మీటర్ల పొడవైన ఈ సర్ఫేస్ టు సర్ఫేస్ క్షిపణిని ఒడిస్సా తీర సమీపంలోని చందీపూర్‌లోని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ కేంద్రం నుంచి ప్రయోగించారు. ఈ సందర్భంగా క్షిపణి తాలూకు వ్యవస్థలన్నీ పూర్తిస్థాయిలో అంచనాల మేరకు పని చేసినట్టు అధికారులు వెల్లడించారు. "రెండు దశలతో కూడిన ద్రవ ఇంధన ఆధారిత క్షిపణి ఆద్యంతం నిర్దేశించిన మార్గంలో దూసుకెళ్లింది. బంగాళాఖాతంలో లక్ష్యాన్ని కచ్చితత్వంతో గమ్యాన్ని ఛేదించింది"అని తెలిపారు. ప్రయోగం ద్వారా ఉద్దేశించిన లక్ష్యాలన్నింటినీ పూర్తిస్థాయిలో సాధించినట్టు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) వర్గాలు వెల్లడించాయి. అత్యాధునిక రాడార్ వ్యవస్థల ద్వారా క్షిపణి గమనాన్ని అనుక్షణం గమనిస్తూ వచ్చినట్టు వివరించాయి. అగ్ని3 ఇప్పటికే సైన్యం అమ్ములపొదిలోకి చేరింది. ఏకంగా 1,500 కిలోలకు మించిన పేలోడ్‌తో 3,000 కి.మీ. పై చిలుకు దూరంలోని లక్ష్యాలను అలవోకగా ఛేదించగల సామర్థ్యం దీని సొంతం.






# యువ భారత్ 'సిక్సర్'

**వైభవంగా విశ్వవిజేత**

**అండర్19 ప్రపంచ కప్ గెలుచుకున్న భారత్**

**ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగులతో విజయం**

**వైభవ్ సూర్యవంశీ 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్స్‌లతో 175**

**టీమిండియా యువ జట్టు ఖాతాలో ఆరో టైటిల్**

అంతర్జాతీయ క్రికెట్ వేదికపై భారత కుర్రాళ్లు మళ్లీ అదరగొట్టారు. అద్భుత ఆటతో అండర్19 ప్రపంచ కప్‌ను సొంతం చేసుకున్నారు. సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ మెరుపు సెంచరీతో పాటు కెప్టెన్ ఆయుశ్ మాత్రే రాణించడంతో భారత్ 100 పరుగుల తేడాతో ఇంగ్లండ్ యువ జట్టును ఓడించింది. భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగులు చేయగా, ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311పరుగులకు ఆలౌటైంది.

ఫాల్క్‌నర్ సెంచరీ సాధించాడు. భారత్ అండర్19 ప్రపంచ కప్ గెలుచుకోవడం ఇది ఆరో సారి కావడం విశేషం. ఈ టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌లలోనూ గెలిచిన భారత్ అజేయంగాముగించింది. గతంలో భారత్‌కు అండర్19 వరల్డ్ కప్ అందించిన కెప్టెన్లు కైఫ్ (2000), కోహ్లి (2008), ఉన్ముక్త్ చంద్ (2012), పృథ్వీ షా (2018), యశ్ ధుల్ (2022) సరసన ఆయుశ్ మాత్రే నిలిచాడు. స్థాయి ఎలాంటిదైనా, వేదిక ఏదైనా, ప్రత్యర్థి ఎవరైనా తనకు తెలిసింది మైదానంలో బ్యాట్‌తో విధ్వంసం సృష్టించడమే అని వైభవ్ సూర్యవంశీ మరోసారి నిరూపించాడు. ఈ పాలబుగ్గల కుర్రాడు సునామీ ఆటతో సరికొత్త రికార్డులను సృష్టిస్తూ దూసుకుపోయాడు. ఆ షాట్లలో పవర్, పదును, ఎక్కడా తడబాటు కనిపించకుండా పూర్తి సాధికారతతో ఆడిన వైనం నిజంగా అసాధారణం. విశేషణాలతో వర్ణించలేని గొప్ప ఇన్నింగ్స్‌ను వైభవ్ క్రికెట్ ప్రపంచానికి చూపించాడు. పాయింట్, కవర్స్, మిడ్ వికెట్, ఫైన్ లెగ్, లాంగాఫ్, లాంగాన్... ఇలా ప్రతీ దిశలో అత్యద్భుత షాట్లతో పరుగుల సునామీ సృష్టించిన వైభవ్ ఏకంగా 15 ఫోర్లు, 15 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. బౌండరీల ద్వారానే 150 పరుగులు రాబట్టిన అతని ఆట ముందు అండర్19 వరల్డ్ కప్ దాసోహమంటూ భారత యువ జట్టును ఆరోసారి విశ్వ విజేతను చేసింది. వైభవ్ మెరుపులతో 400పైగా పరుగులు చేసి సవాల్ విసిరిన భారత్ ముందు ఇంగ్లండ్ నిలవలేకపోయింది. కొంత పోరాడినా లక్ష్యానికి సుదూరంగానే ఆగిపోవడంతో భారత కుర్రాళ్లు ప్రపంచ చాంపియన్లుగా సగర్వంగా నిలిచారు. హరారే: ఐసీసీ అండర్19 ప్రపంచకప్‌లో భారత్ మరోసారి విజేతగా నిలిచింది. మొత్తం 16 సార్లు టోర్నీని నిర్వహించగా... భారత్ టైటిల్ సాధించడం ఇది ఆరోసారి కావడం విశేషం. శుక్రవారం ఇక్కడ జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత యువ జట్టు 100 పరుగుల తేడాతో ఇంగ్లండ్ అండర్19 టీమ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వైభవ్ సూర్యవంశీ (80 బంతుల్లో 175; 15 ఫోర్లు, 15 సిక్స్‌లు) అసాధారణ సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ ఆయుశ్ మాత్రే (51 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో అండగా నిలిచాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 90 బంతుల్లోనే 142 పరుగులు జోడించారు. అనంతరం ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది.

కాలెబ్ ఫాల్క్‌నర్ (67 బంతుల్లో 115; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) శతకం నమోదు చేయగా, బెన్ డాకిన్స్ (56 బంతుల్లో 66; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. టోర్నీలో 7 ఇన్నింగ్స్‌లలో కలిపి ఏకంగా 169.49 స్ట్రయిక్‌రేట్‌తో మొత్తం 439 పరుగులు సాధించిన వైభవ్ సూర్యవంశీకే 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దక్కింది.

**రాణించిన కెప్టెన్**


గత మ్యాచ్‌లో చెలరేగిన హైదరాబాదీ బ్యాటర్ ఆరోన్ జార్జ్ (9) ఫైనల్లో విఫలమైన అనంతరం వైభవ్, ఆయుశ్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. ధాటిగా ఆడిన కెప్టెన్ 50 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తర్వాతి బంతికే అతను అవుట్ కాగా, 51 పరుగులు జత చేసిన వేదాంత్ త్రివేది (36 బంతుల్లో 32; 2 ఫోర్లు), విహాన్ మల్హోత్రా (36 బంతుల్లో 30; 2 ఫోర్లు) ఆరు పరుగుల వ్యవధిలో వెనుదిరిగారు. అభిజ్ఞాన్ కుందు (31 బంతుల్లో 40; 6 ఫోర్లు, 1 సిక్స్), చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడు ప్రదర్శించడంతో స్కోరు 400 దాటింది. తొలి 25 ఓవర్లలో 250 పరుగులు చేసిన భారత్ తర్వాతి 25 ఓవర్లలో 161 పరుగులు సాధించింది.

ఫాల్క్ నర్ మినహా...

భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ బాగా తడబడింది. డాకిన్స్, బెన్ మాయెస్ (28 బంతుల్లో 45; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 74 పరుగులు జోడించి మెరుగైన స్థితిలో నిలిపినా ఆ తర్వాత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయి 22 ఓవర్లలో 177/7 వద్ద ఓటమికి చేరువైంది. ఈ దశలో జేమ్స్ మింటో (28)తో కలిసి ఫాల్క్‌నర్ కొద్దిగా పోరాడాడు. భారీ షాట్లు ఆడిన ఫాల్క్‌నర్ అంబ్రిష్ ఓవర్లో 3 సిక్స్‌లు బాది 63 బంతుల్లో సెంచరీ సాధించాడు. అయితే తర్వాతి ఓవర్లోనే ఖిలాన్ చక్కటి క్యాచ్‌తో అతను చివరి వికెట్‌గా అవుట్ కావడంతో భారత్ సంబరాల్లో మునిగిపోయింది. తొలి మూడు బంతుల్లో పరుగు తీయలేదు, నాలుగో బంతికి ఫోర్‌తో స్కోర్ మొదలైంది. అవతలి వైపు తొలి వికెట్ పడే సమయానికి 13 బంతుల్లో 10 పరుగులే. అయితే ఈ కొద్దిసేపు మాత్రమే వైభవ్ కాస్త ప్రశాంతంగా కనిపించాడు. పాయింట్ దిశగా కొట్టిన మొదటి సిక్స్‌తో జోరు షురూ చేసిన అతను అనంతరం ఎక్కడా తగ్గలేదు. ఆ తర్వాతా ఇదే మోత కొనసాగుతూ మరో 14 సిక్సర్లు అతని ఖాతాలో చేరాయి! మింటో ఓవర్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టిన వైభవ్ 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. ఆఫ్ స్పిన్నర్ ఫర్హాన్ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన అనంతరం అతని తర్వాతి ఓవర్లో వైభవ్ మరింత చెలరేగిపోయాడు. వరుసగా 6, 6, 4, 6తో బంతిని చితక్కొట్టాడు. ఆల్బర్ట్ ఓవర్లో ఆఫ్ సైడ్ దిశగా సింగిల్ తీయడంతో 55 బంతుల్లో వైభవ్ శతకం పూర్తయింది. ఆ వెంటనే గ్రీన్ ఓవర్లో కూడా మరో 2 సిక్స్‌లు కొట్టిన అనంతరం ఆల్బర్ట్ వేసిన ఇన్నింగ్స్ 23వ ఓవర్లో మరింత పండగ చేసుకున్నాడు. వైభవ్ వరుసగా 2, 4, 6, 6, 4, 4 బాదగా వైడ్‌తో కలిసి మొత్తం 27 పరుగులు వచ్చాయి.

# 3 వారాల్లో తేల్చాల్సిందే!

న్యూఢిల్లీ: తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మె ల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టు మరో సారి డెడ్ లైన్ విధించింది. అనర్హతలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న కాలయాపనపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. మూడు వారాల్లోగా ఈ పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. ఒకవేళ నిర్ణయం వెలువడకపోతే తామే నేరుగా జోక్యం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీద్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కేసును విచారించింది. తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు వినిపించారు. 'అనర్హత పిటిషన్లపై విచారణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. పెండింగ్‌లో ఉన్న మొత్తం పిటిషన్లలో ఒకదానిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాం. మిగిలిన రెండు పిటిషన్లు కూడా విచారణలో ఉన్నాయి. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల హడావుడి ఉండటం వల్ల స్పీకర్ కొంత సమయం కోరాల్సి వచ్చింది. మార్చి మధ్యలోగా లేదా అంతకంటే ముందే ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉంది..' అని చెప్పారు. సింఘ్వీ వాదనలను పిటిషనర్లు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్ తరఫు సీనియర్ న్యాయవాది మోహిత్‌రావ్ తీవ్రంగా వ్యతిరేకించారు. 'గత 16 నెలలుగా ఈ వ్యవహారాన్ని స్పీకర్ కార్యాలయం తొక్కిపెడుతోంది. స్పీకర్ స్వయంగా నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని



గతంలో కోర్టుకు హామీ ఇచ్చి, ఇప్పటివరకు కేవలం ఒక్కసారి మాత్రమే విచారణ జరిపారు. ఒక ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అయినా ఆయన ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారు. ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?..' అని ప్రశ్నించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం..తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగాన్యాయవాద వృత్తిలోని నైతికతపై జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోర్టు గదుల్లో జరిగే వాదనలను రికార్డ్ చేసి సోషల్ మీడియాలో 'రీల్స్' రూపంలో పోస్ట్ చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 'న్యాయస్థానాలను రీల్స్ కోసం వాడుకోవద్దు. ఇది ఇప్పుడు ఒక కొత్త పరిశ్రమగా మారింది. బాధ్యతాయుతమైన ఆఫీసర్లుగా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు..' అని హితవు పలికారు.

# బదులిచ్చే ధైర్యం ప్రధానికి లేదు: ఖర్గే

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శు క్రవారం విమర్శలు గుప్పించారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ప్రధానికి లేదన్నారు. ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదని ఆరోపించారు. పదేపదే అబద్ధాలు చెప్పడమే మోదీ పని అని ఆరోపించారు. 'రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై మోదీ తన 97 నిమిషాల ప్రసంగంలో ముఖ్యమైన, అవసరమైన విషయం ఒక్కటీ చెప్పలేదు. ఇంకా వందేళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల కిందటి సంగతులే మాట్లాడుతున్నారు" అని ఎద్దేవా చేశారు. "లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించిన ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకం ఇంకా ప్రచురణ కాలేదని అధికార పక్షం పార్లమెంటులో చెబుతోంది. తాము ఆ పుస్తకాన్ని బాహాటంగా చూపినా వారికి అర్థం కావడం లేదు. ముందుగా వాస్తవాలను శ్రద్ధగా విని, ఆపై సమాధానం చెప్పాలి" అని ఖర్గే అన్నారు. రాహుల్, కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ వివాదంపైనా ఆయన స్పందించారు. సభ బయట ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణను సిక్కులకు జరిగిన అవమానంగా ముద్ర వేశారని మండిపడ్డారు. "సిక్కులను కాంగ్రెస్ పార్టీ ఎంతో గౌరవిస్తుంది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేశారు" అని గుర్తు చేశారు. సిక్కులను, దళితులను, ఆదివాసీలను ఎవరినీ గౌరవించే అలవాటు లేనిది బీజేపీకేనన్నారు. ఇతరు లను ఎలా కించపరచాలా అనే మోదీ ఆలోచిస్తారని ఖర్గే ఆరోపించారు.



## ఉస్తాద్‌లో శ్లోకగా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కిస్తోన్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో ఇద్దరు ముద్దుగుమ్మలు నటిస్తున్నారు. ఓ హీరోయిన్‌గా ఇప్పటికే శ్రీలీల ఫిక్సయ్యింది. మరో హీరోయిన్‌గా ఎవర్ని తీసుకుంటారనే దానిపై ఇన్నాళ్లు పాటు కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. ఈ మూవీ నుంచి తాజాగా క్రేజీ అప్డేట్ వచ్చింది. సినిమా నుంచి కొత్త పోస్టర్ ను రిలీజ్ చేసింది చిత్ర బృందం. ఈ ప్రాజెక్టులోఅందాల భామ రాశీ ఖన్నా భాగమైనట్లు తెలుపుతూ ఆమె పాత్రను రివీల్?చేసింది. ఉస్తాద్?లో ఈ బ్యూటీ శ్లోకగా సందడి చేయనుంది. మరోవైపు ఇప్పటికే రాశీ షూటింగ్ సెట్‌లో అడుగు పెట్టి, పవన్ తో కలిసి కీలక సన్నివేశాల్లో పాల్గొంటుందని సమాచారం. మరోవైపు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

## టబు



## జోర్డాన్‌లో జూనియర్ జోరు.. యాక్షన్‌తో అదరగొట్టనున్న 'డ్రాగన్'

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ మరియు సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'డ్రాగన్' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్ర నెక్స్ట్ షెడ్యూల్ జోర్డాన్‌లో షూటింగ్ జరుపుకోనుంది. దీనికోసం చిత్ర యూనిట్ ఇప్పటికే అక్కడ లొకేషన్స్ ఫైనల్ చేశారు. ఫిబ్రవరి నెలలో జరగబోయే ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌పై మూడు అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించడానికి ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడు. ఈ సినిమాలో తారక్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించేందుకు ప్రశాంత్ నీల్ రెడీ అవుతున్నాడు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ బాడీ లాంగ్వేజ్ మరియు ఫిజిక్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జోర్డాన్ షెడ్యూల్‌లో చిత్రీకరించబోయే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాకే హైలైట్‌గా ఉండనున్నాయట. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. మలయాళ నటుడు టోవినో థామస్ కూడా ఈ ప్రాజెక్టులో భాగమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

